
అతన్ని యెర్రయ్య అంటారు. ముద్దొస్తే యెర్రెదవ అనికూడా వ్యవహరిస్తారు. ఊళ్ళో వున్న పెద్దలోగిళ్ళన్నింటికీ అతని తండ్రి రామయ్యే మంగలి, పండగలు వస్తే అర్థరాత్రి ఒంటిగంటకు పోయి మిట్ట మధ్యాహ్నం ఒంటిగంటదాకా వంచిన నడుం ఎత్తకుండా చేస్తేగాని తలగడుగులు పూర్తయేవి కావు. అన్ని యిళ్ళలో అవు సనిపించుకున్నంత మాత్రాన రామయ్యకు ఇంటి ఖర్చులు చెల్లే అవకాశం లేదు. పోనీ అతనికి ఒక్కత్తా పెళ్ళాం? ఒక ఉంపుడు గత్తెనుకూడా పోషించేవాడు. యిద్దరికీ సమానంగాజరిపేవాడు.



ఎర్రయ్యకు ఆ మాత్రం యీ మాత్రం ఊహ వచ్చేసరికి రామయ్య ప్రభ మాంచి జోరుగా వెలిగేది. ప్రతి నిమిషం కబురుమీద కబురు వచ్చేది. ఎవరింట్లో పెళ్ళి అన్నా: ఎక్కడ కోర్టు తవ్వాయిలు వున్నా రామయ్యా వుండాల్సిందే! ఎర్ర

య్యకుతండ్రి అంటే చాలా గొప్పవాడని నమ్మకం. తనుకూడా పెద్దవాడయాక అంత గొప్పవాడూ అవుతాననీ, అవాలనీ అనుకునేవాడు

"ఏముంది! అందరిదగ్గరా వినయంగా ఉండటం! జాగ్రత్తగా మర్యాదగా గెడ్డాలు గీయటం! రాత్రిళ్ళు కాళ్ళు పట్టడం! ఏడాదీ తిరిగేసరికి రావాల్సిన జీతంగింజలు ఇంట్లో కాళ్ళముందుంటాయి! పెళ్ళి పేరంటం వస్తే రూపాయో అర్ధో మిగుల్తాయి. పంట రోజుల్లో పొలాలకిపోతే మాంచి భారీగా జోకట్ట పనలు కట్టుకోనిచ్చేవారు తండ్రిని. గానుగాటల్లో తువ్వాలు తడుపు కూర్చుంటే నాలుగు వీశలకు తక్కువ లేకుండా బెల్లం పెడతారు తండ్రి భారీ మనిషి, గనక పెద్ద మోపు పట్టుకొచ్చేవాడు తనూ శక్తిమేరకు తెచ్చుకుంటాడు.

యిలా సాగేవి ఎర్రయ్య ఆలోచనలు

ఎర్రయ్యకు పెళ్ళి తలపెట్టాడు రామయ్య. ఉన్న దాంట్లో ఘనంగానే చేసాడు. ఉంపుడుగత్తెకూడా పెళ్ళికి వచ్చి సాయంచేసింది. తన యింటికివచ్చి తన కొడుకు పెళ్ళిలో పూసుకునీ రాసుకునీ తిరగటంతో రామయ్య పెళ్ళానికి తిక్క రేగింది ఆమెనోటి ధాటి చివరకు సంసారంలో పెద్ద కోలాహలాన్ని రేపింది.


ఎర్రయ్య కొత్తగా వచ్చిన పెళ్ళాం మోజులో వున్నాడు ఆమె పడుకునుంటే చూస్తూ వుండిపోయేవాడు. ఎఱ్ఱటెరుపు. తనో నల్లటోడు. అయితేనేం? అది తన సొంతం అతనికి గర్వంగా కోరికగా ఉండేది అప్పటికి అతనికి పదిహేడో ఏడు. ఆమెకు పధ్నాలుగు.

పెళ్ళాం ధాటికి తట్టుకోలేక ఉంపుడుగత్తెను తీసుకొని ఎటో వెళ్ళిపోయాడు రామయ్య.

ఒక్కసారి బరువు బాధ్యతలన్నీ ఎర్రయ్య నెత్తిమీద పడ్డాయి ఊరంతటికీ తల్లో నాలికయిపోదామని, అందరితో మంచిగా ఉండాలనీ మనసులో ఉబలాటం. ఐతే వాడి అమాయకత్వం తల బిరుసుతనంగా ఉండేది. వీటన్నిటికీ మించిన లోపం ఒకటుండేది.

క్షురకర్మకూడా ఒక కళ. మెట్లుపెట్టకుండా తల గొరగాలి. మీసం అందంగా మలచాలి గెడ్డం గీస్తుంటే మండకూడదు. ఎదుటివాళ్ళకు యీపని చేస్తూంటే విసుగెత్తకూడదు అందుకు కబుర్లు చెప్పాలి. అంత ఆత్మీయంగా దగ్గరగా కూర్చున్న మనిషి చెప్పే కబుర్లు ఒకేరకంగా ఉండకూడదు. కొద్దిగా వ్యక్తిగతంగా ఉండాలి. కొత్త ఆలోచలను సృష్టించేవిగా ఉండాలి. నవ్వితే గెడ్డం తెగుతుంది అందుకని కాస్త సీరియస్‌గా మరీ నవ్వు వచ్చేట్టుగా కాకుండా ఉండాలి ఇటువంటి కళలో ఎర్రయ్య నిష్ణాతుడు కాడు సరికదా కనీస ప్రవేశంకూడా లేనివాడు.

ఎలాగయినా అవుననిపించుకోవాలని టైము తీసుకునేవాడు అది బోరుగా ఉండేది. కంగారుపడి తొందరపెడితే తిరుపతిమెట్లో, పంపర పనసకాయడిపోప్పే తయారయేవి హిట్లరు మీసం ఒకవేపు, మరోరకం మీసం మరోవయిపూ ఏర్పడేవి. దాంతో చేయించుకునే వాడికి



వి(రెత్తుకు వచ్చేది. కాఫీడబ్బులు మాట దేవుడెరుగు, మస్తుగా చివాట్లు దొరికేవి. రోజూ అందరి యిళ్ళూ చూడలేకపోయే వాడు. క్రమక్రమంగా ఒకరొకరూ నౌకరీ లోంచి తీసేయసాగారు

అప్పటికి పద్దెనిమిదేళ్ళు నిండాయి అతనికి. తండ్రి ఎందుకు గొప్పవా డయాడా అని ఆలోచించేవాడు. ఎప్పుడూ పట్నం వెళ్లేవాడు తండ్రి. అస్తమానూ కోర్టు అనేవాడు. అయినా ప్రతివాళ్ళూ విసుక్కునే వారే కాని ఎవరూ పనిలో నుంచి తీసేసేవారు కారు అలాంటిది కాస్త ఆలస్యంగా వెళ్తే 'మా గెడ్డాలు మేమే గీసేసుకున్నాం పొమ్మంటున్నారు.

పంటరోజుల్లో పొలాలకు వెళితే కాళ్లు పట్టమనేవారు. పడుతూ కూర్చునేవాడు. అడక్కుండా అమ్మయినా పెట్టదన్న విషయం ఎర్రయ్యకు అర్ధమయ్యేదికాదు. ఎంతోకాలం నుంచీ వస్తున్న వార్షికం గదా యివ్వటం ఎలా మానుతారనుకొనే వాడు. హక్కుకూడా నోరు విప్పి అడి గినా అమలు జరుపబడటం కష్టమని అతని లాంటి వాళ్ళకు ఎలా తెలుస్తుంది? చెట్లు కాయలు కాసినట్లుగా పెద్దవాళ్ళు నీతిగా ఉంటారనుకునేవాడు

సగానికి పైగా లోగిళ్ళలో అతనికి ఉద్వాసన జరిగింది మిగిలిన యిళ్ళలో జీతం గింజలుబాయిపెట్టే రకాలు కొన్ని! నాలుగురాళ్ళు వచ్చేటప్పుడు ఒకరిద్దరు యివ్వకపోయినా అనేదికాదు ఒకటికి రెండుసార్లడిగితే 'ఏ రేజరో సాయం చేసుకుంటాం! పొమ్మ'నేవారు.

ఎర్రయ్యకు తండ్రి వార్తలు అప్పు డప్పుడు తెలిసేవి. ఇదమిద్ధంగా ఫలానా చోట ఉన్నాడంటే వెళ్ళి కడుపో కాళ్ళో పట్టుకుని తీసుకొద్దామనుకొనేవాడు. ఒకరు చెప్పిందానికీ మరొకరు చెప్పిందానికీ పొంతన వుండేదికాదు దాంతో చిర్రెత్తు కొచ్చి తల్లిని రోజూ తిట్టిపోసేవాడు.

"ఎదవనాయాలా! నీ నోరడిపోనూ! నీ పోరు పడలేకే గందే మారాజులాంటి మనిషి దూరపై (పోయాడు "

"యీనలేని గొడ్డు ఊరంతరిపిందంట కానీ సేరెయ్యటం రాదు. నాలుక్కాళ్ళట్టు కుంటం రాదు! యెదవ మొకం ఏసుకుని పొద్దత్తమానూ దాని మొకం సూత్తా కూకుంటావు. నన్నంటన్నావంట్రా" తల్లి ఎగిరేది.

అలసిపోయేదాకా తిట్టుకుని ఎర్రయ్య గదిలోకి పోయేవాడు అతని తల్లి నులక మంచం వాల్చుకుని తిట్టుకుంటూ మొత్తు కుంటూ కూర్చునేది.

పూతమీదున్న మామిడిచెట్టులా ఏపుగా ఎదిగింది ఎర్రయ్యభార్య. ఆమె వయసు శరీరాన్ని నిగనిగలతో నింపేసింది అత నికి బ్రతుకులో ఆనందపడే విషయం పెళ్ళాం మాత్రమే అయింది

'పిన్న బడ్డీ లెగదీస్తాసు సూస్తాండు!' అంటూండే వాడు

అతని కలలనిండా కుషన్ సీట్సుతో రివాల్వింగ్ చైర్స్, పెద్దపెద్ద నిలువెత్తు బట్టలు విప్పుకున్న ఆడవాళ్ళ ఫొటోలు! ఫేన్సు! షేవింగ్ మెషీన్! పదిమంది పనివాళ్ళు!

ఆ కలలెలా నెరవేరుతాయో అర్ధ మయేది కాదు ఉన్న ఆస్థి యిల్లు. అది కూడా ఆ పల్లెటూళ్ళో ఎవడు కొంటాడు? కొంటేమాత్రం ఎంత ధర పలుకుతుంది?




అయినా యిల్లమ్మేసి ఎక్కడుంటాడు? ఎర్రయ్యకు బ్రతుకు చీకటిగా ఉన్నట్లుందేది

నూకరాజు కొంచెం వున్న రైతు ఉమ్మడికుటుంబం కావటంవల్ల ఊళ్ళో మంచికీ చెడ్డకీ ముందుండటానికి సావకాశం వుండేది చాలా కాలం అతని తండ్రి పంచాయితీ ప్రెసిడెంట్‌గా వుండేవాడు. పోటీలు రావడంతో ఎలక్షన్ల జోలికి పోవటం మానేసాడు. నూకరాజు తండ్రులు ఆరుగురు పెద్దతని పెద్దకొడుకు అతను. గారాబంగా పెరగటంవల్ల అనుకున్నవన్నీ జరగాలని పట్టుదల హెచ్చు.

ఆ యేడు ఎలక్షన్లు దగ్గరపడ్డాయి.

"మీ వంశమేటీ? కులవేఁటీ? యిన్నాల్లు ఊరంతట్నీ యిటుదటుసేసీ అటుదిటు సేసీ యేలాడు మీ అయ్య. ఈనగాపి నక్కలపాలు సేపినట్టు ఓ కొలిక్కి దెచ్చిన వూరుని ఎవుడో గందోలీగాడు లెగటంతోటే పదివాడి కాగ్గేసీ సతికిలబడిపోయాడు! మంచికో చెడ్డకో ఆ మారాజొగ్గేత్తే మాత్తరం అంతటోడి కడుపున బుట్టి నువ్వూరుకుంటావేంటి నూకరాజూ! లెగు లెగహే! అసలు యీ పంచాయితీ పెసిడెంటుగిరీ మీ లోగిలి దాటరాదు అది నీ కులం హక్కు మావందరం నీ ఎనకే కొమ్ముకాత్తాం! నీ జనవంహక్కును నువ్వే కాసుకోవాలి." అంటూ రేపెట్టారు కొందరు చిన్నపెద్దలు.

నూకరాజు లేచాడు. వయసలాంటిది. తండ్రి అన్నాడు

"బాబా! పదివెక్కాలంటే మంచి కాదురా కావల్సింది కులం! ఆ పయిన సొమ్ములు. నిజవేఁ! మనం ఓపాలి యీ

వూరినేలినోళ్ళవే! అయితే ఏం? యీ వూళ్ళో మన బలగం తక్కువ! ఆళ్ళు మూడొంతులున్నారూ ళ్ళో! ఆళ్ళని యిడగొట్టినన్నాళ్ళూ మనదే రాజ్జెం! ఆళ్ళొకటయిపోయారు! అనూపానూసూపి యెవసాయం సెయ్యమన్నారు. ఊరికే రెపరెపలాడితే ఒరిగేదేటంట?"

నూకరాజు వినలేదు

ఊళ్ళో దుమారం లేచింది. ప్రచారం మొదలయింది.

ఎర్రయ్య యింటికెదురుగానే నూకరాజు లోగిలి ఓమారు గెడ్డం గీస్తుంటే తెగింది. నాలుగుతన్ని తగిలేసాడు ఒంట్లో కండలు వూళ్ళో భూములూ వున్న నూకరాజు

అతని ప్రత్యర్థి రాఘవయ్య ఆ యింట్లో ఎర్రయ్యకు యింకా పూర్తిగా ఉద్వాపన జరగలేదు ఈలోగా ఎలక్షన్లు రావటం రాఘవయ్య పార్టీ వాళ్ళ కంటిలో ఎర్రయ్య పడటం జరిగింది

"వద్దు బాబయ్యా! పెద్దోళ్ళ యవ్వారాల్లోకి నన్నిడసమాకండి" వాళ్ళావేళ్ళా బడ్డాడు ఎర్రయ్య

చెప్పిచెప్పి ఆఖరున తురుఫాసు ఉపయోగించాడు రాఘవయ్య.

"అందుకేగదంట్రా వూరువూరంతా యెర్రెదవా అంటన్నది ఎలాంటోడి కడుపున బుట్టావురా! అసల్నాకు తెల కడుగుతానూ నిన్నసలు మంగల్రామయ్యకే కందంట్రా నీ అమ్మ! ఛాఛా! ఎదవ బయ్యం ఎదవ బయమని"

ఎర్రయ్యకు పౌరుషం తన్నుకొచ్చింది. మంగలి రామయ్య కొడుకు తను చాలా గొప్పోడి కొడుకు! తండ్రి పేరు నిలబెట్టాలి.

"ఏం సెయ్యాలో సెప్పండి."

"అద్దిగద్దీ మాటంటే! ఎలాగయినా రావయ్య కొడుకు రావయ్యకొడుకే ..!"

ఎర్రయ్య చెయ్యాల్సింది నూకరాజు ఇంటికి రాత్రిపేళలో ఎవరెవరొస్తున్నదీ ఆరాతియ్యడం! వీలయితే ఎవరికయినా ఏమయినా ముట్టితే తెలుసుకోవటం! అతనికా పని ఏమంత కష్టంగా తోచలేదుకాని పెళ్లాన్ని విడిచిపెట్టి రాత్రంతా ఎదుటిల్లు చూస్తూ కూర్చోవటమే పెద్ద కష్టమనిపించింది

ఎలక్షనయిపోయింది

నూకరాజు చిత్తుగా ఓడిపోయాడు.

అతని యింటిముందు ఎర్రయ్యయింటి వద్ద గెలిచిన పార్టీ వూరేగింపు ఆగింది. కావల్సినవాళ్ళకి ఎర్రయ్య యింట్లోంచి మంచినీళ్ళందాయి ఓడిపోయిన వాళ్ళకి ఉప్పందింది. ఊరేగింపు సాగిపోయింది.

రాత్రయింది. ఊరు సద్దుమణిగింది నూకరాజు మొట్టమొదటిసారి తాగాడు. "ఇంత బతుకూ బతికి " అనుకున్నాడు. "ఊరంతా కలపి మంచోడి కన్నేయం సేసింద"ని అరిచాడు. బోనులో పెట్టిన పులయిపోయాడు ఆ సమయంలో అతని చెవిన ఎర్రయ్య విషయం పడింది ఆకలిగొన్న ప్రాణికి అంకిందే తడవు న్యాయం అన్యాయం అన్న వేలేవు

ఎర్రయ్యకు పిలుపు వచ్చింది నూకరాజు ముందు దోషిగా నిలబడ్డాడు.

"ఎరా !యెర్రినాకొడకా! నాకాళ్ళట్టుకుంటే ఆ యెదవిచ్చే పాటియ్యనంట్రా. ! నాలోగిలికెదురుగ్గా ఉంటానే నాకే ఎసరెడతావంట్రా !"

"నాకేటీ తెల్దు బాబయ్యా!" ఎర్రయ్య

దొకచే మాట.

"నీ తాత మా తాత కాళ్ళట్టాడు. నీ బాబు మా బాబు కుడిభుజంలా మసిలాడు. మద్దెంతరంగా నీకీ పుండెందుకు పుట్టింది. ఆళ్ళేటి సెప్పారు? ఏటన్నారు?" అనున యంగా అడిగాడు.

ఎర్రయ్యకు బుర్ర తిరిగిపోయింది. 'అవును మరి అందరవూ యీ ఇంటి ఉప్పు తిన్నోళ్ళమే! ఆయేల ఈ బుద్దేటయి పోయింది?' ఏమనాలో తెలియక వూరు కొన్నాడు

నూకరాజు కలబడి నాలుగు బాదాడు ఎర్రయ్యను. 'పోరా లంజికొడకా!' అని మెడబట్టుకు బయటకు గెంటేసాడు.

జరిగిందంతా రాఘవయ్య గుంపుతో చెప్పాడు ఎర్రయ్య నలుగురూ నాలుగు మాటలన్నారు.

"ఏదో సెప్పి నచ్చజెప్పుకోవాలగాని, ఆళ్ళతో కయ్యవాడి మాకాడి కొస్తే మా వేటి సెయ్యగల్దుం? నిన్నెనకేసుకుని ఆడింటిమీద కెగబడలేంగందా !!"

"పవురుసం లేనెదవ! మాతో రాగూడదా? నోరూ వాయీ లేనాడి నట్టుకొని తన్నాడు "

"అయ్యిందేదో అయ్యిందేటి సేస్తాం మరి! ఈసుట్టు ఆడు పిలిస్తే యెల్లమాక"

ఆఖర్నిరాఘవయ్య అన్నాడు."పోన్లేరా ఎర్రయ్యా! ఈ పాలేటయినా అయితే నా కొచ్చి సెప్పు సెయ్యాల్సిందేదో సేద్దారి. కొట్టినెదవ గట్టిగానయినా కొట్టలేదు డాక్ట్రు సరిటిపికెటట్టు కొని కోరుటుకెళ్ళి పోదుం"

ఆ నోటా యీ నోటా ఎర్రయ్య ఎదుటి పార్టీకు సాయపడటానికి కారణం నూకరాజుకు చేరింది."యెదవన్నర యెదవన్నర యెదవ నాయాల !" పళ్ళు పటపటా కొరికాడు. "నీ బాబేకన్నాడంటే అబిమానం వచ్చిందంట రా!"

అతనలా అనుకుంటున్నప్పుడేమసాలా సామాను నూరటానికి పయికొచ్చింది ఎర్రయ్య పెళ్లాం. ఎర్రఎర్రగా యెదిగి పిటపిటలాడుతున్న యవ్వనం కవ్విస్తు న్నట్లయింది రోజూ చూస్తూనే వున్నా ఆ రోజే కొత్తగా చూస్తున్నట్లుంది.

"నా కొడకా! నడీదిలో నీ పెళ్లాన్నట్టు కొచ్చి ఏదయినా సేస్తే ఎవుడ్రా అడ్డ వొస్తాడు?"

అర్థరాత్రయింది

భార్యను చుట్టుకున్న చేతుల్ని ఎవరో విడదీస్తున్నట్టయి లేచాడు! అంతా చీకటి! అయోమయం! ఎవరో అటూ ఇటూ నించున్నారు ఒక్కమారుగా ఏదో అన్యాయం జరిగి పోతున్నట్లయింది.

"ఓర్నాయనోయ్" అంటూ అరిచాడు అతని నోటిని రెండు చేతులు బలంగా మూసేసాయి రెక్కలు విరిచి పట్టుకున్నారు. అరిచాడు' తన్నుకున్నాడు'

నూకరాజు తాలూకు పశువులదొడ్డిలోకి యీడుచుకు పోయారు ఎర్రయ్య పెళ్లాన్ని.

ఎర్రయ్యను విడిచిపెట్టారు. పరుగు పరుగున ఆ అర్ధరాత్రివేళ పిచ్చివాడిలా పరిగెత్తుకుంటూ వెళ్ళి రాఘవయ్య ఇంటి తలుపులు దబదబా బాదాడు

చుట్టూ మూగిన జనంతో చెప్పుకుంటు న్నాడు! ఏడుస్తున్నాడు వీధిదీపం తాపీగా వెలిగింది. దాని వెనకే మరి కొంచెం సేపటికి ఆ తలుపులు తెరుచుకున్నాయి.

"బాబయ్యో! నా కొంప మునిగి

పోయింది! నా యాలి నెత్తుకుపోయారు" లోపలకు జొరబడ్డాడు ఎర్రయ్య. రాఘవయ్య కాళ్లు చుట్టేసాడు.

పోగుబడిన జనం "ఘోరకలి " "అన్యాయం" అనుకుంటున్నారు తమలో తాము

బనీను పక్క జేబులోంచి చుట్టతీసి నోట్లో పెట్టి, మొదలు కొరికి తుపుక్కుమని ఉమ్మాడు రాఘవయ్య.

"ఏట్రా' ఏటయింది"

"యింకేటవుద్ది బాబయ్యా! నాబారియా నెత్తుకునెళ్ళిపోయారు లెగండిబాబయ్యా!"

"నువ్వేటి సేస్తన్నావ్రా?"

"ఏటి సెయ్యగల్నురా దేవుడా! నన్నిద్దరు పట్టేసుకున్నారయ్యా! దరమపెబువ్వి లెగుబాబయ్యా! దాన్నిడిపించుబాబయ్యా'"

"బలే పిక్కు తెచ్చావురా ఎర్రయ్యా ఆడింటి మీదకెళ్ళితే రేప్పొద్దు కోరుటులో యేటి సెప్పుకుంటాం" ఆలోచిస్తున్నట్లు న్నాడు

"నువ్వే అలాగంటే నాకు దిక్కేటయ్యా! నా బతుకేటయి పోవాలయ్యా"

పక్కనున్న వోళ్ళంతా పదండెల్దామన్నారు రాఘవయ్యతో. అతను కదెక్కలేదు, నాన్చేసాడు.

"ఒ పని సెయ్యరా!" ఆఖరున అన్నాడు.

"???"

"ఇదిగో! యీకత్తి పట్టుకెళ్ళు. అడ్డుబడి నోణ్ణల్లా నరికేయ్. కోరుటులో నాన్చూసుకుంటాను "

అడుగు పొడుగుంది కత్తి! పదునుగా రక్తం కావాలని అరుస్తున్న కాళికాదేవి నాలికలా వుంది. ఎర్రయ్య తన ముందున్న కత్తిని చూశాడు. ఏడవటం మానేశాడు. తండ్రి గొప్పతనం, చాకచక్యం తన అమాయకత్వం అప్రయోజకత్వం అన్నింటినీ ఒకేఒక్క వేటున తెగనరికి పారెయ్యాలి ! అతని రెండు పిడికిళ్ళూ కత్తిపిడిమీద బలంగా బిగుసుకున్నాయి. చివ్వున రాఘవయ్యవైపు తిరిగాడు.

"నువ్వయినా ఆడయినా మీకున్న దాంతో ఒకళ్ళనొకళ్ళు నరుక్కోని సవ్వలేక నాలాంటెర్రెదవల్నుసి గొలిపి యినోదం సూస్తారంట్రా. మీరంతా ఒక్కటేరా! నాకులాంటోళ్ళెర్రెదవలవబట్టె గందరా మీయాటలు " మాటలు పూర్తికాకముందే కత్తి రక్తపు పారాణి పూసుకుంది.

రాఘవయ్య సగంతెగిన చేతిని పట్టుకొని 'అయ్యో' అంటూ కూలబడ్డాడు.

"నా కొడకల్లారా! ఎవ్వరడ్డమయినా పుచ్చెలెగిరిపోతాయ్."

అరుస్తూ ఎర్రయ్య చేతిలో కత్తితో ఎక్కడో కోడికూస్తున్నవేళ నూకరాజు ఇంటివయిపు పరిగెత్తాడు

అతని ముఖంమీద పడిన ఎర్రటిరక్తం చుక్క భూతాల్నించి; దయ్యాల్నించి రక్షించడానికి వాళ్ళమ్మ పెట్టిన అమ్మోరి బొట్టులా మెరిసింది. □